సాక్షి
చిత్తూరు
బుధవారం। 30। ఆగస్టు। 2023



పవిత్రోత్సవం

తిరుమలలో శ్రీవారి పవిత్రోత్సవాలు మంగళవారంతో పరిపూర్ణమయ్యాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. - 8లో



చదువుతోనే ఉజ్వల భవిత

విద్యారంగంలో ప్రభుత్వ ప్రోత్సాహాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	24
తిరుపతి	34	26
తిరుమల	30	21
గూడూరు	36	27
నగరి	36	25

న్యూస్‌రీల్

గజ బీభత్సం



ఏనుగులు నేలకూల్చిన కొబ్బరి చెట్లు

పెద్దపంజాణి: మండలంలోని పెనుగొలకల గ్రామంలో సోమవారం రాత్రి ఏనుగులు గుంపు బీభత్సం సృష్టించింది. శేఖర్, ఆనంద అనే రైతులకు చెందిన వరి, టమాట పంటలను నాశనం చేశాయి. వెంకటప్ప, ఈశ్వరమ్మ అనే రైతుల కొబ్బరి చెట్లను నేలకూల్చాయి. గజరాజుల దాడుల్లో సుమారు రూ.లక్ష మేరకు పంట నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు దొరస్వామి, రవికుమార్, చంద్ర ఘటనాస్థలానికి చేరుకుని ఏనుగులు నాశనం చేసిన పంటలను పరిశీలించారు. బాధిత రైతులకు నష్టపరిహారం మంజూరు చేయించేందుకు చర్యలు చేపడతామన్నారు. ట్రాకర్ల సహాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. పలువురు రైతులు మాట్లాడుతూ వారం నుంచి గజరాజుల విధ్వంసం కొనసాగుతూనే ఉందన్నారు. ప్రధానంగా జిట్టంవారిపల్లె, ముదిరెడ్డిపల్లె, పెద్దకాప్పల్లె, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లెలోని పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

శారదాపీఠాధిపతికి బ్రహ్మోత్సవ ఆహ్వానం



స్వరూపానందేంద్ర స్వామికి ఆహ్వానపత్రిక అందిస్తున్న మోహన్‌రెడ్డి, వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిని ఆహ్వానించారు. మంగళవారం ఉత్తరాఖండ్‌లోని రుషికేష్‌లో ఉన్న పీఠాధిపతిని కాణిపాకం ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీన వినాయకస్వామి దర్శనార్థం శారదాపీఠాధిపతి విచ్చేయనున్నట్లు వెల్లడించారు.

వడ్డీలేని రుణాలతో మహిళలకు ఆటోలు

చిత్తూరు అగ్రికల్చర్ : జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు వడ్డీలేని రుణాలతో ఆటోలను అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సంఘం ఆర్థిక లావాదేవీలను సక్రమంగా నిర్వహిస్తూ, ఎల్ఎల్ఆర్ లైసెన్స్ కలిగిన 50 ఏళ్ల లోపు గ్రామీణ మహిళలు అర్హులన్నారు. డీజిల్, బ్యాటరీ, ప్యాసింజర్, ట్రక్ ఆటోలను అందించనున్నట్లు వివరించారు. ఆటో కొనుగోలు ధరలో సభ్యులు తమ వాటా కింద ముందు 10 శాతం జమ చేయాల్సి ఉంటుందన్నారు. మిగిలిన మొత్తాన్ని 60 వాయిదాల్లో కట్టుకోవచ్చని సూచించారు. ఈ పథకం కింద ప్రస్తుతం మండలానికి రెండు ఆటోలు మాత్రమే మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. వివరాలకు 9390504602 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వడమాలపేట హైస్కూల్‌కు 'స్పోర్ట్స్ ఎక్సలెన్స్'



అవార్డు అందుకుంటున్న చంద్రశేఖర్‌రాజు

పుత్తూరు రూరల్: వడమాలపేట బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2023–24 విద్యా సంవత్సరానికి గాను స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. మంగళవారం తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ శేఖర్ చేతుల మీదుగా పాఠశాల పీడీ చంద్రశేఖర్‌రాజు అవార్డు అందుకున్నారు. సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ, శాంతారెడ్డి, స్పోర్ట్స్ కాంప్లెక్స్ చీఫ్ కోచ్ సయ్యద్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ విజయకుమారి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సోమవారం అర్ధరాత్రి వరకు 68,263 మంది స్వామివారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు ఉంటే 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కోవిడ్ సమయంలో చతికిల పడిన పవర్‌లూమ్ పరిశ్రమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుజ్జీవం పోశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ ఆర్డర్ అందించి అండగా నిలిచారు. రెక్కాడితే కానీ డొక్కాడని నేతన్నల బతుకుల్లో వెలుగులు నింపారు. పోషణ కరువై కునారిల్లుతున్న కార్మికుల కడుపు నింపారు. ఆపదవేళ నిజమైన 'నేస్తం'గా తోడ్పాటునందించారు. ఈ క్రమంలోనే మరింతగా సాయం చేసేందుకు విద్యుత్ చార్జీల్లో మినహాయింపు ఇస్తూ సగర్వంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా నగరిలో సంబరాలు మిన్నంటాయి.



ప్లకార్డులతో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న మరమగ్గాల నిర్వాహకులు, కార్మికులు

మురిసిన మగ్గం

- ఎలక్ట్రిసిటీ డ్యూటీ మినహాయింపుపై నేత కార్మికుల హర్షాతిరేకాలు
- పవర్‌లూమ్ నిర్వాహకుల ఆనందోత్సాహాలు
- ముఖ్యమంత్రి నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు
- జగన్నకు రుణపడి ఉంటామంటూ సంబరాలు

నగరి : జగనన్న విద్యాదీవెన పథకం కింద ఈ ఏడాది తొలి త్రైమాసికం నిధులు విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం నగరికి విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో పవర్‌లూమ్ పరిశ్రమపై వరాల జల్లు కురిపించారు. మరమగ్గాలకు విద్యుత్ చార్జీల్లో యూనిట్‌కు ఒక్క రూపాయి చొప్పున తగ్గిస్తున్నామని, దీంతో ఎలక్ట్రిసిటీ డ్యూటీ రద్దవుతుందని ప్రకటించారు. దీంతో మరమగ్గ నిర్వాహకులు, కార్మికుల్లో ఆనందం వెల్లివిరిసింది. మంగళవారం సాయంత్రం ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం ఆధ్వర్యంలో నగరి టవర్ క్లాక్ సెంటర్ వద్ద సంబరాలు జరుపుకున్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాణసంచా పేలుస్తూ పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. ముఖ్యమంత్రి చిత్రపటాలతో ప్లకార్డులు పట్టుకుని జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం మరమగ్గ నిర్వాహకుడైన మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ నేతన్నలకు జగనన్న అన్ని సమయాల్లోను అండగా నిలిచారన్నారు. కరోనా పరిస్థితుల్లో మరమగ్గ పరిశ్రమకు ప్రభుత్వ స్కూల్ యూనిఫామ్ ఆర్డర్లు అందించారని గుర్తుచేశారు. దీంతో 3వేల మంది కార్మికులకు మూడు నెలల పాటు పనిదొరికిందని తెలిపారు. విద్యుత్ చార్జీల్లో మినహాయింపు ఇవ్వడం ఆనందంగా ఉందని వెల్లడించారు.

మేలు మరువలేం



మంత్రి ఆర్‌కే రోజా మా పరిస్థితిని వివరించిన వెంటే ముఖ్యమంత్రి జగనన్న అర్థం చేసుకుని ఎలక్ట్రిసిటీ డ్యూటీని రద్దుచేస్తున్నట్లు ప్రకటించడం చాలా సంతోషాన్ని కలిగించింది ఆయన మాట ఇస్తే తప్పకుండా నెరవేరుస్తారు. విద్యుత్ చార్జీలు తగ్గించడం మరమగ్గం పరిశ్రమలకు ఉపయోగకరం. జగనన్న మేలు మరువలేం.

– ఏఎం ఏలుమలై, మరమగ్గం నిర్వాహకుడు, చింతలపట్టెడ

రుణపడి ఉంటాం



నేత సామాజికవర్గానికి ఇంతగా ఎవరూ మేలు చేయలేదు. కరోనా సమయంలో పని కల్పించారు. మా వ్యాపారానికి ఉపయోగపడేలా చెన్నై మార్గంలో ట్రైన్లను ఆపేలా చేశారు. ప్రస్తుతం విద్యుత్ చార్జీల సమస్యను ఆలకించి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. జగనన్నకు ఎప్పుడూ రుణపడి ఉంటాం. – నాగరాజు, కార్మికుడు, కొత్తపేట

పరిశ్రమకు చేయూత



మరమగ్గ పరిశ్రమను అభివృద్ధి పథంలో నడపడానికి ప్రభుత్వం చేయూత అందిస్తోంది. గతంలో యూనిఫామ్ ఆర్డర్లు ఇప్పించింది. ప్రస్తుతం విద్యుత్ చార్జీల్లో అదనంగా వచ్చే డ్యూటీలను రద్దు చేసింది. మంత్రి ఆర్‌కే రోజా కృషి ప్రశంసనీయ.

– బాబు, మరమగ్గం నిర్వాహకుడు, ఏకాంబరకుప్పం

భారం తగ్గుతుంది



ప్రస్తుతం వచ్చే విద్యుత్ చార్జీల భారంలో యూనిట్‌కు ఒక రూపాయి చొప్పున తగ్గుతుంది. పవర్‌లూమ్ కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. మంత్రి ఆర్‌కే రోజా మా ఉన్నతి కోసం ఎప్పుడూ సాయం అందిస్తున్నారు. ఆమె చల్లగా ఉండాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నాం.

– లక్ష్మణన్, మరమగ్గ కార్మికుడు, సత్రవాడ

అందరికీ లబ్ధి



జగనన్న నిజమైన ప్రజా నాయకుడు. ఎలక్ట్రిసిటీ డ్యూటీ తగ్గించడంతో కార్మికులు, నిర్వాహకులు అందరికీ లబ్ధి చేకూరుతుంది. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటాం. మంత్రి రోజా సహకారంతో నేత పరిశ్రమకు మేలు జరుగుతోంది. క్షేత్రస్థాయిలో మా సమస్యలపై ఆమెకు అవగాహన ఉండడం వల్లే ఇది సాధ్యమైంది.

– షణ్ముగం, మరమగ్గ కార్మికుడు, కేవీపీఆర్ పేట

అధికారం కోసమే బాబు అసత్యాలు



చంద్రబాబు ఇచ్చిన రైతు రుణమాఫీ హామీ పత్రం చూపుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : అధికారం కోసమే చంద్రబాబు అసత్యాలు వల్లిస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపడ్డారు. మంగళవారం మండల పరిధిలోని ఈడిగపల్లి గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబుది రక్తచరిత్రని, జగనన్నది సంక్షేమ చరిత్రను తెలిపారు. బాబుకు మోసాలు, దందాలు, చేయడం వెన్నెతో పెట్టిన విద్యని విమర్శించారు. అధికారం కోసం సమావేశాల పేరుతో దాడులు దమన కాండలు చేయిస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తుంటే ఓర్వలేక స్టేల పేరుతో మోకాలడ్డుతున్నారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రైతులకు ఇచ్చిన హామీలను ఎందుకు నిలబెట్టుకోలేక పోయారో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో నరేంద్ర మోదీని నరరూప రాక్షసుడని, అదే సోనియాగాంధీని ఇటలీ మహిళని విమర్శించి, ఇప్పుడు అధికారం కోసం ఢిల్లీలో మోదీ కాళ్లు పట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు నెరవేరి ఉంటే, సంక్షేమ పథకాలు అంది ఉంటేనే నాకు ఓటు వేయండి అని ధైర్యంగా చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. ప్రజా తీర్పుతో గెలుపొందిన జగనన్నను కనీసం వార్డు మెంబర్ కూడా కాని లోకేష్‌కు ప్రశ్నించే అధికారం లేదన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ దౌర్జన్యాలకు భయపడేవారు ఎవరూ లేరని స్పష్టం చేశారు.

మహనీయులు మెచ్చిన తెలుగు



గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : మహనీయులు మెచ్చిన భాష తెలుగు అని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష కీలకమన్నారు. తెలుగు వ్యవహారిక భాషోద్యమకర్తగా, హేతువాదిగా, ఉపాధ్యాయునిగా, పరిశోధనాకర్తగా రామమూర్తి చేసిన కృషి అమూల్యమని కొనియాడారు. గ్రాంథికంలో కఠినంగా ఉన్న తెలుగు వచనాన్ని వ్యవహారిక భాషలోకి తీసుకువచ్చారని వివరించారు. డీఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ జాతి మనుగడకు భాష కీలకమని చెప్పారు. వ్యవహారిక భాషగా మార్చేలా ఉద్యమించిన రామమూర్తి గొప్ప సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఓ కులశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని తిరువణ్ణామలైకు బుధ, గురువారాలు తిరుపతి జిల్లా నుంచి వంద బస్సు సర్వీసులు నడపనున్నట్లు తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4 నుంచి 6 గంటల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ డిపోల నుంచి 100 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రాచీనం.. ప్రాశస్త్యం

పూతలపట్టు సమీపంలోని వావిల్‌తోట చారిత్రక సాక్ష్యంగా విలసిల్లుతోంది. చోళ సామ్రాజ్య చిహ్నాలతో ఆకట్టుకుంటోంది. శతాబ్దాల కిందటి 101 ప్రాచీన ఆలయాలతో అలరారుతోంది. నాటి సాంస్కృతిక వైభవానికి నిలువెత్తు నిదర్శనంగా నిలబడుతోంది. అయితే పలు కట్టడాలు నవాబుల దాడిలో ధ్వంసమయ్యాయి. కాలక్రమంలో కొన్ని శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని ఇప్పటికీ చెక్కుచెదరకుండా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా చోళ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఏడు చోట్ల నిర్మించిన ఆలయాలు ఓంకార రూపంలో ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

- వావిల్‌తోటలో చోళుల కట్టడాలు
- గత వైభవానికి ఆనవాళ్లుగా 101 ఆలయాలు
- ఓంకార రూపంతో చారిత్రక సాక్ష్యాలు
- చెక్కుచెదరని పలు నిర్మాణాలు

చిత్తూరు రూరల్/పూతలపట్టు: పూతలపట్టు మండలంలోని వావిల్‌తోట పంచాయతీ పరిధిలో 23 గ్రామాలు ఉన్నాయి. 11, 12, 13 శతాబ్దాల కాలంలో ఈ ప్రాంతం చోళుల పాలనలో ఉండేదని చరిత్రలో పేర్కొన్నారు. అప్పట్లో చోళులు తమ సామ్రాజ్యాన్ని మండలాలు, వలనాడులు, నాడులు, గ్రామాలుగా విభజించి పాలించేవారు. వీరి పాలనలో అత్యంత విశిష్టమైంది గ్రామపాలన. కాణిపాకం పట్నం నుంచి జీడీనెల్లూరు కలవకుంట వరకు చోళులు స్థావరాలను ఏర్పాటు చేసుకుని గ్రామపాలన సాగించారు. పూర్వం వావిల్‌తోటను చిన్న కంచి అని పిలిచేవారు. చోళులు రాజ్య విస్తరణతో పాటు వాణిజ్యం, వ్యవసాయంతోపాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్ద పీట వేశారు. శైవభక్తితో ప్రధానంగా శివాలయాలు నిర్మించారని ప్రసిద్ధి.



వావిల్‌తోట గ్రామం



కట్టమంచి కుళందీశ్వరస్వామి ఆలయం



పూతలపట్టులోని భీమేశ్వరస్వామి ఆలయం

చోళుల చిహ్నాలు

వావిల్‌తోటలోని శివాలయం స్తంభాలపై ఉన్న శిల్పాలు, కళాఖండాలను చూసి పురావస్తుశాఖ వారు పరిశీలించిన చోళుల నిర్మితమని నిర్ధారించారు. శివాలయంలో నంది విగ్రహంతో పాటు పలు కాంస్య ప్రతిమలు ఉండేవి. ఏళ్ల క్రితమే ఈ విగ్రహాలను దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలకు తరలించి భద్రపరచారు. ఆలయ ఆవరణలోని కోనేరు ఉండగా కొన్నేళ్ల కిందట పూర్తిగా శిథిలమైంది. అయితే శ్రీకృష్ణ ఆలయం, శ్రీవేంకటేశ్వరస్వామి గుడి, వినాయస్వామి , వీరభద్రేశ్వర స్వామి, ఆంజనేయస్వామి, కావిడమ్మ, కద్రేమ్మా, గుండమ్మ, సత్యమ్మ, దుర్గమ్మ, భైరేశ్వర, ద్రౌపదీ అమ్మవారి ఆలయాలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. అక్కడక్కడ శివలింగాలు సైతం దర్శనమిస్తున్నాయి. ఇవన్నీ రాతి కట్టడాలు కావడం విశేషం. ఈ క్రమంలో చోళుల నిర్మించుకున్న స్థావరాలు మాత్రం ఇటుకలతో ఉండడం గమనార్హం. వాటిలో కొన్ని ఇప్పటికీ అలాగే ఉన్నాయి. కొన్ని అప్పటి నవాబుల ధ్వంసం చేసినట్లు చరిత్రలో ఉంది. ఈ ఆలయాలకు మాన్యం కింద సుమారు 60 ఎకరాలు ఉన్నాయి. వీటిని వావిల్‌తోటకు చెందిన ఓ కుటుంబం సంరక్షిస్తోంది. వారే ఈ ఆలయాలకు ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు.



మణికంఠేశ్వరస్వామి ఆలయం

గుప్తనిధుల తవ్వకాలు

పురాతన ఆలయాల్లో గుప్తనిధుల కోసం కొందరు తవ్వేశారు. పలు చోట్ల విగ్రహాలను అపహరించారు. అయితే వాటి స్థానంలో వావిల్‌తోట గ్రామస్తులు మళ్లీ విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. గుప్తనిధుల తవ్వకాల కారణంగానే కొన్ని ఆలయాలు దెబ్బతిన్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని సైతం పునర్నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు.

తమిళంలో ఓంకారం!



వావిల్‌తోట శివాలయం

చిత్తూరు ఇరువారంలోని నాగేశ్వర ఆలయం, నీవానది తీరంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, కట్టమంచిలోని కుళందీశ్వరస్వామి ఆలయం, కాణిపాకంలోని మణికంఠేశ్వరస్వామి ఆలయం, కలవకుంట శివాలయం, పూతలపట్టులోని భోగేశ్వరస్వామి ఆలయం, వావిల్‌తోట శివాలయాలు చోళ వైభవానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. కార్తీక పౌర్ణమి రోజున ఈ ఏడు ఆలయాలను సందర్శిస్తే పునర్జన్మ ఉండదని స్థల పురాణంలో ఉంది. ఈ ఆలయాల నిర్మాణం తమిళంలో ఓం ఆకారంలో ఉంటుందని, సప్తర్షులు ఇక్కడ విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు ఇరువారం నాగేశ్వరస్వామి ఆలయంలోని రాతి శాసనంలో పేర్కొనడం విశేషం.

నిత్య పూజలు



శివాలయంలో నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. మేము కూడా ప్రతి రోజూ స్వామివారిని సేవించుకుంటున్నాం. భగవంతుడి కృపతోనే మా కుమారుడు ఆరోగ్యంగా ఉంటున్నాడు. ఆలయ గోడలపై తమిళ అక్షరాలు ఉన్నాయి. ఈ ఆలయం గురించి మా పూర్వీకులు చాలా గొప్పగా చెప్పేవారు.

– ప్రవీణ, గ్రామస్తులు, వావిల్‌తోట

త్వరలోనే ఆలయ కమిటీ



వావిల్ తోటలో పురాతన ఆలయాలు ఉన్నాయి. సుమారు 101 ఆలయాలు, స్థావరాలు ఉన్నట్లు పెద్దలు మాకు కథలు కథలుగా చెప్పేవారు. చోళుల కాలంలో నిర్మించిన పురాతన ఆలయాల పరిరక్షణకు త్వరలోనే కమిటీ వేయాలని గ్రామ పెద్దలు సంకల్పించారు. యువతను సైతం భాగస్వాములు చేయాలని నిర్ణయించారు.

– మురళి, గ్రామస్తుడు, వావిల్‌తోట

బాధ్యతగా వ్యవహరిస్తున్నాం



మా గ్రామంలో 101 ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ 101 శక్తులకు ప్రాణ ప్రతిష్ఠ చేసినట్లు పెద్దలు చెప్పేవారు. ప్రస్తుతం ఉన్న ఆలయాలతోపాటు దారి పొడవునా చిన్న గుడులు ఉండేవి. వాటిలో చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. తరతరాలు మా కుటుంబీకులే ఆలయాలకు ధర్మకర్తలుగా బాధ్యతగా వ్యవహరిస్తున్నాం.

– సుధాకర్‌రెడ్డి, ఆలయాల ధర్మకర్త, వావిల్‌తోట

ముఖ్యమంత్రి చిత్రపటంతో గృహప్రవేశం

కుప్పంరూరల్ : నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం లబ్ధిదారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం చేతపట్టుకుని గృహప్రవేశం చేశాడు. పట్టణంలోని సామగుట్టపల్లెకు చెందిన లబ్ధిదారుడు కుమార్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నిసార్లు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వలంటీర్ల తమ ఇంటికే వచ్చి దరఖాస్తు తీసుకుని స్థలం మంజూరు చేయించాడని వెల్లడించారు. గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1.80లక్షలు అందించిందని, తాను కొంత మొత్తం కలుపుకుని ఓ ఇంటి వాడిని అయ్యానని ఆనందం వెలిబుచ్చారు.



సీఎం చిత్రపటంతో గృహప్రవేశం చేస్తున్న కుమార్

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

చిత్తూరు రూరల్: నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లను డీఐఓ రవిరాజు మంగళవారం తనిఖీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనధికారికంగా కొందరు స్కానింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నారని, వారిపై క్రిమినల్ కేసులు పెడతామని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ లేకుండా స్కానింగ్ సెంటర్ నడిపితే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. జిల్లాలో ఇప్పటికీ పదుల సంఖ్యలో రెన్యూవల్ చేసుకోకుండా స్కానింగ్ సెంటర్లు నడుస్తున్నాయని, వారందరూ వెంటనే రెన్యూవల్ చేయించుకోవాలని ఆదేశించారు



స్కానింగ్ సెంటర్ తనిఖీలో డీఐఓ రవిరాజు

వేడుకగా బాలగంగమ్మ జాతర



బాలగంగమ్మను దర్శించుకుంటున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి మంగళం: మంగళం పంచాయతీ ఎస్‌సీబీ కాలనీలో బాలగంగమ్మ జాతరను మంగళవారం ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజ లు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి రాంబాబు, ఎంపీటీసీ లక్ష్మి, ఉపసర్పంచ్ బైరెడ్డి రమేష్, వార్డు సభ్యుడు దయాకర్, హరికృష్ణ పాల్గొన్నారు.

22ఏ రద్దుతో లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు



సీఎం జగన్, భూమన చిత్రపటాలకు పాలాభిషేకం

తిరుపతి మంగళం: తిరుపతి నగరంలోని పలు ప్రాంతాలు 22ఏ రద్దుతో రిజిస్ట్రేషన్లకు అవకాశం లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి ఆధ్వర్యంలో సీఎం జగన్, ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తాతయ్యగుంట పరిసర ప్రాంతాల్లో సుమారు 800 మంది లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి ఆసక్తి గల వారు సెప్టెంబర్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 8 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 8 అంగన్‌వాడీ కార్యకర్తలు, 9 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 42 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌తో మామిడిలో అధిక దిగుబడి

చంద్రగిరి: మామిడి తోటలకు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ అన్నారు. మంగళవారం పనపాకం గ్రామంలో డ్రిప్ ఇరిగేషన్ చేస్తున్న మామిడి తోటలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

చదువుతోనే ఉజ్వల భవిత

- విద్యకు జగనన్న అండ
- నాడు-నేడుతో పాఠశాలలకు మహర్దశ
- తెలుగు భాషకూ ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: 'మేము చదువుకునే రోజుల్లో ఎవ్వరూ తోడుగా లేరు. సరైన తిండిలేక.. బస్సు చార్జీలకు డబ్బుల్లేక అల్లాడాం. వేసుకోవడానికి దుస్తులు లేక తిప్పలు పడ్డాం. ఇప్పుడు కాలం మారింది. సీఎం జగనన్న విద్యకు అండగా నిలిచారు. విద్యార్థులపై భారీగా పెట్టుబడి పెడుతున్నారు. భవిష్యత్తును బంగారు మ యం చేసేందుకు తాపాత్రయ పడుతున్నారు. మీకు పౌష్టికాహారంతోపాటు, స్కూల్ యూనిఫాం, బ్యాగు, షూ, బెల్టు ఇలా.. సకల వసతులు కల్పిస్తున్నారు. నాడు-నేడుతో పాఠశాల ల రూపురేఖలు మార్చేస్తున్నారు. మీరు కష్టప డి చదవండి. ఉన్నత శిఖరాలను అధిరోహించండి' అంటూ సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మేరుగ నాగార్జున, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి విద్యార్థులకు హితబోధ చేశా రు. వారు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల(కాసాగార్డెన్)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాత్‌రూమ్‌లు, తరగతి గదులు, డార్మెంట్రీలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న తెలుగు భాష దినోత్సవంలో పాల్గొన్నారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాష గొప్పతనాన్ని కొనియాడారు. అనంతరం విద్యార్థినులను సమస్యలడిగి తెలుసుకున్నారు. తాను పూర్ స్టూడెంట్ అని, ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చానని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీని విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. 11.6 శాతం ఉన్న పేదరికాన్ని నేడు 6 శాతానికి తెచ్చారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు

గతంలో కనీస వసతులు లేక సమస్యలతో సతమతమవుతున్న ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ హంగులతో ఆకట్టుకుంటున్నాయని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల సౌకర్యాలకు అందే నిధులను గత పాలకులు మింగేసేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. సీఎం జగనన్న వచ్చిన తర్వాత రాష్ట్రానికి 18 మెడికల్ కళాశాలలు వచ్చాయన్నారు. పేద వారు చదువుకున్నప్పుడే ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతారని చెప్పారు. ఇక్కడ ఉన్న చిన్నచిన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, పాకల మండలి సభ్యురాలు సుమతి, రామచంద్రయ్య, సురేష్, కిరణ్, నాని, భార్గవ్, ఆనంద్ పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,490

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

బైక్‌ల దొంగకు జైలు

సోమల: వివిధ చోరీ కేసుల్లో 11 ద్విచక్రవాహనాలను అపహరించిన సంతోష్ అనే ముద్దాయికి మంగళవారం పుంగనూరు కోర్టు 6 నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు తెలిపారు. చౌడేపల్లె మండలం దుర్గ సముద్రానికి చెందిన సంతోష్‌పై నేరాలు రుజువు కావడంతో ఫస్ట్ క్లాస్ అడిషినల్ జడ్జి సింధు ఈ మేరకు తీర్పునిచ్చినట్లు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి గతంతో ఎస్‌ఐగా పనిచేసిన మారుతి పకడ్బందీగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వివరించారు.

• పవిత్రోత్సవం



ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి

తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిశాయి. ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. అనంతరం యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. దీంతో పవిత్రోత్సవాలు ముగిసినట్టు ఆలయ అధికారులు పేర్కొన్నారు. – తిరుమల

పలమనేరు దాతలకు టీటీడీ సత్కారం



రవీంద్రారెడ్డిని సన్మానించి ప్రసాదం అందిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

పలమనేరు : తిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి కూరగాయలను వితరణగా అందిస్తున్న పలమనేరు దాతలను మంగళవారం టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఘనంగా సత్కరించారు. కూరగాయల వితరణలో తమిళనాడులోని తిరుచ్చి తర్వాత పలమనేరు రెండో స్థానంలో ఉందని తెలిపారు. ముఖ్యంగా రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీగా కూరగాయలు పంపుతున్నారని ప్రశంసించారు. 2004 నుంచి దాతల సహకారంతో నిత్యాన్నదానం సాగుతోందని వివరించారు. బ్రహ్మోత్సవాలకు సైతం విరివిగా కూరగాయలను పంపించేందుకు దాతలు చొరవచూపాలని కోరారు. అనంతరం శ్రీవారి సేవకులకు స్వామివారి ప్రసాదాలను అందించారు.

భయపడి బిడ్డను వదిలేశాం..!



బిడ్డ తల్లిదండ్రులను విచారిస్తున్న సీఐ మద్దయ్య ఆచారి

చిత్తూరు అర్బన్: చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పురిటి బిడ్డను వదలి పారిపోయిన దంపతులను పోలీసులు గుర్తించారు. వారిని మంగళవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. సీఐ మద్దయ్య ఆచారి కౌన్సెలింగ్ ఇచ్చి విచారిస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో ఈనెల 16వ తేదీన బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి, ఆ పసికందును బాత్ రూమ్‌లో వదిలి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. దీనిపై ఆస్పత్రి వైద్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిత్తూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీ ఆధారంగా బిడ్డ తల్లిదండ్రులు బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లెకు చెందిన అఖిల, మహేష్‌గా గుర్తించారు. విచారిస్తే.. కూలీ పనిచేసే తమకు తొలికాన్పులో ఆడపిల్ల పుట్టిందని, రెండోసారి ఏడు నెలలకే బిడ్డ పుట్టడంతో భయంతో శిశువును వదిలిపారిపోయినట్లు చెప్పినట్లు తెలుస్తోంది. దీనిపై వైద్యులతో సంప్రదించిన తర్వాత ముందుకు వెళ్లాలని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. నెలలు నిండని పసికందుకు ప్రస్తుతం తిరుపతి రుయాలో చికిత్స అందిస్తున్నారు.

వేటూరి ప్రభాకరశాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి



ప్రభాకరశాస్త్రి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్వీ వేద వర్సిటీ వీసీ, టీటీడీ డీఈఓ

తిరుపతి కల్చరల్: వేటూరి ప్రభాకర శాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఎస్వీ వేద వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి కొనియాడారు. మంగళవారం ప్రభాకరశాస్త్రి 73వ వర్ధంతిని ఎస్వీ ప్రాచ్య కళాశాలలో నిర్వహించారు. కళాశాలలోని వేటూరి విగ్రహానికి నివాళులర్పించారు. కవిగా, చరిత్ర, శాసన పరిశోధకుడిగా, ప్రాచీనాంధ్ర సంకలన ప్రచురణకర్తగా ప్రభాకర శాస్త్రి తనదైన ముద్ర వేశారని అన్నారు. స్విమ్స్ వైద్యుడు అల్లాడి మోహన్, టీటీడీ విద్యాశాఖాధికారి ఎం.భాస్కర్‌రెడ్డి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ, ప్రిన్సిపల్ సీతారామశర్మ, అధ్యాపకులు నారాయణస్వామిరెడ్డి, లక్ష్మీనారాయణ, భూపతి నాయుడు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్లపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి



గాయపడిన లారీ డ్రైవర్లు

నాగలాపురం: లారీ డ్రైవర్లపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం ఉదయం నాగలాపురం మండలం, బైటకొడియంబేడు గ్రామ సమీపాన చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. చెన్నై నుంచి రైల్వేకోడూరు, బోంబాయి నుంచి చెన్నైకి వెళుతున్న లారీ డ్రైవర్లు నవదీప్, సియారామ్ తమ లారీలతో వచ్చి విశ్రాంతి కోసం బయటకొడియంబేడు సమీపాన ఉన్న దాబా వద్ద ఆపి విశ్రాంతి తీసుకుంటున్నారు. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మోటారు బైకుపై వచ్చి లారీ డ్రైవర్లను డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. దీంతో లారీ డ్రైవర్లు నిరాకరించడంతో దుండగులు తమ వెంట తెచ్చిన కత్తితో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. ఆపై లారీ డ్రైవర్లు తిరగబడడంతో దుండగులు పరారయ్యారు. దీనిపై నాగలాపురం ఇన్‌చార్జ్ ఎస్‌ఐ పురుషోత్తం రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవం.. సన్నద్ధం



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మాడ వీధులు, ప్రధాన కూడళ్లలో పెయింటింగ్ పనులు జోరందుకున్నాయి. మంగళవారం స్వామివారి ధర్మ రథాన్ని కార్మికులు సన్నద్ధం చేయడం కనిపించింది. - తిరుమల

నీళ్లకుంటఘటనపై లోతుగా విచారణ

పలమనేరు : పట్టణంలోని నీళ్లకుంటలో తండ్రీకొడుకులపై దాడులు చేసిన నిందితుడి ఇంట్లో జింక కొమ్ములు, మారణాయుధాలు లభించిన ఘటనపై లోతుగా విచారణ చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే నిందితుడు సద్దాంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సద్దాం కొందరు యువకులను కూడగట్టుకొని అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నాడనే విషయమై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా పేకాట నిర్వహించడం, గంజా సరఫరా, మారణాయుధాలపైనే కాకుండా ఈ ముఠా వెనుక ఎవరిహస్తం ఉందో త్వరలోనే తేలుస్తామని స్పష్టం చేశారు. ఇక సద్దాం ఇంట్లో జింక కొమ్ములు లభించడంపై విచారిస్తున్న ఎఫ్ఆర్ఓ శివన్న తెలిపారు.

రౌడీ షీటర్లకు నిరంతరం కౌన్సెలింగ్

తిరుపతి క్రైం: రౌడీ షీటర్ల పై నిరంతరం నిఘా ఉంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సావేరి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన నేర సమీక్షా సమావేశంలో తిరుపతి జిల్లాలోని అధికారులు, సిబ్బందితో ఎస్పీ క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై బాధితులకు న్యాయం చేయాలన్నారు. అలసత్వం వహిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.